గిరిజనులకు తప్పని అవస్థలు

డోలిలో గర్భిణిని ఆసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి -అనంతగిరి:గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేక పోవడంతో గిరిజనులు ఆసుపత్రికి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. అనంతగిరి మండలం మారుమూల పిన్నకోట కివర్ల, జీనబడు, పెద్దకోట, పిన్నకోట పంచాయతీ పరిధి పివిటిజి గ్రామాలకు నేటికీ సరైన రోడ్డు మార్గ సౌకర్యం లేదు. పిన్నకోట పంచాయతీ రాచకిలం కొండ శివారు గ్రామానికి చెందిన సుకురు చిన్నమ్మ గర్భిణీ. ఆమెకు ఆదివారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వైద్య సేవల కోసం దుప్పటితో డోలి కట్టి గ్రామం నుండి జలగరువు గ్రామం మెయిన్ రోడ్డు వరకు తరలించారు. అక్కడ నుండి అంబులెన్స్‌లో వినకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డోలిలో తరలిస్తున్న బంధువులు

అంగన్‌వాడీలపై నిర్బంధం

-సమస్యలను చెప్పుకునేందుకు విజయవాడ వెళ్లనివ్వని పోలీసులు -ఎక్కడికక్కడ అడ్డగింత

హుకుంపేటలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

రాజ ఒమ్మంగిలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - విలేకరుల బృందం

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం విజయవాడ బయలేరిన అంగన్‌వాడీలను ప్రభుత్వం విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ఎక్కడికక్కడ అడ్డుకుంది. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, రహదారుల్లో పోలీసులు కాపలకాసి వెళ్లనీయకుండా చేశారు. అనకాపల్లి, తుని రైల్వే స్టేషన్లలో రైలు ఎక్కకుండా వెనక్కు పంపించారు. అనకాపల్లి కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కనీయలేదు. పార్వతీపురం నుంచి బస్సులో వెళ్తున్న వారిని నక్కపల్లి సమీపంలో అడ్డుకున్నారు. అచ్యుతాపురం, రాంబిల్లి మండల సిఐటియు నాయకులు సోమునాయుడు, దేముడునాయుడులను, రావికమతం మండలంలో ప్రజా సంఘాల నాయకురాలు సత్యవతిని గృహనిర్బంధం చేశారు. ఇంకా అనేక చోట్ల సిఐటియు నాయకుల కోసం పోలీసులు గాలించారు. విజయవాడ కార్యక్రమానికి అనుమతుల్లేనందున వెళ్లే ఆలోచన విరమించుకోవాలని అనకాపల్లి ఎస్‌పి కెవి మురళీకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. అల్లూరి జిల్లాలో అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజును, అరకులోయలో ఆదివాసీ గిరిజన సంఘం నేత బాలదేవ్‌ను గృహ నిర్బంధం చేశారు. ప్రభుత్వ తీరును సిపిఎం, సిఐటియు కమిటీలు ఖండించాయి.

పాడేరు: జిల్లా కేంద్రంలో ఐటిడిఏ ఎదుట అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు సమ్మెలో భాగంగా నిర్వహిస్తున్న నిరవధిక దీక్ష 41వ రోజు ఆదివారం కొనసాగించారు. తమ సమస్యల పరిష్కారం పై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని నినాదాలు చేశారు. విజయవాడ వెళ్లే అంగన్వాడీ లపై పోలీసుల నిర్బంధాలు, అక్రమంగా అరెస్టులను ఖండించారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాంలో భాగంగా చలో విజయవాడకు వెళుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి వి.భాగ్యలక్ష్మిని పోలీసులు నిర్బంధించి అరెస్టుకు పూనుకోవడం దుర్మార్గమైన చర్య అని సిఐటియు జిల్లా కార్యదర్శి సుందర్‌రావు అన్నారు. సమస్యల పరిష్కరించక పోగా అనేక రూపాల్లో హెచ్చరికలు జారీ చేస్తూ, నిర్బంధాలు ప్రయోగించడం అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హుకుంపేట:

స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ టీచర్లు చేస్తున్న సమ్మె ఆదివారం 41వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం నోటీసులు ఇచ్చి అంగన్వాడీ టీచర్లను భయ భ్రాంతులకు గురి చేయడం సరికాదని అంగన్వాడీ యూనియన్ నేతలు అప్పలకొండమ్మ, కృష్ణవేణి అన్నారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఇన్ని రోజులు ధర్నా చేస్తున్నా కనీసం ఆడవాళ్లని కూడా కనికరం లేక పోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం దిగివచ్చి సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేదెంటూ వారు ముక్తకంఠంతో తెల్పి చెప్పారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు. పద్మ కుమారి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి :కోటి సంతకాలతో జగనన్నకు చెపుదాం చలో విజయవాడకు కదులుదాం అని సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ అంగన్వాడీలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పలు గ్రామాలలో సంతకాలు సేకరించారు. ఆ సంతకాలను మీడియాకు చూపించారు. ఈ సంతకాల పత్రాలను జగనన్నకు చేరవేస్తామన్నారు. సేకరించిన సంతకాలను విజయవాడలో జగనన్నకు ఇవ్వడానికి వెళుతున్న అంగన్వాడీలను పోలీసులు అడ్డుకుని నిర్బంధించి గృహ నిర్బంధం చేయడం సరికాదన్నారు. చలో విజయవాడకు ఎన్ని అడ్డంకులు సృష్టించినా దాటుకుంటూ అంగన్వాడీలు సేకరించిన సంతకాలు సమర్పించే తీరుతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు రాములమ్మ, పెంటమ్మ, అక్కమ్మ, లక్ష్మి, ఇందు, జానకమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

చింతపల్లిలో సంతకాల పత్రాలు చూపుతున్న పడాల్

పెదబయలు: అంగన్వాడీ వర్కర్లను ప్రభుత్వం అక్రమ అరెస్టులు నిర్బంధాన్ని, సిఐటియు అల్లూరి జిల్లా ఉపాధ్యక్షులు బోడా సన్నిబాబు తీవ్రంగా ఖండించారు. మండల కేంద్రంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో 41వ అంగన్వాడీల సమ్మె కొనసాగింది. అంగన్వాడీ వర్కర్ల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయకుండా టెర్మినేట్ చేస్తామని ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తుందని సన్నిబాబు విమర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు టి రాజమ్మ, కొండమ్మ, కౌసల్య, పద్మ, భాగ్యలక్ష్మి సుబ్బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి:మండలంలో అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. ఎస్మా చట్టం ప్రయోగించి అంగన్వాడీలకు మెమోలు జారీ చేసి భయ పెడుతున్నారని ప్రజా సంఘాల నేతలు విమర్శించారు.

విఆర్.పురం. తమ డిమాండ్ల సాధనకు ఆందోళన చేస్తున్న అంగన్వాడీల పట్ల ప్రభుత్వ వైఖరి దుర్మార్గమని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనం సత్యనారాయణ ఆక్షేపించారు. 41రోజులుగా శాంతియుతంగా నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకపోగా,నిర్బంధం లోకి తీసుకోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు సున్నం రంగమ్మ సిఐటియు, మిడ్డే మీల్స్ కార్మికులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : అంగన్వాడీల నిరవధిక సమ్మె పట్ల ప్రభుత్వనిర్బంధ వైఖరిని నిరసిస్తూ ఆదివారం 41వ రోజున రాజవొమ్మంగిలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సంరదృంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు కె వెంకటలక్ష్మి, చిన్ని కుమారి మాట్లాడుతూ, చాలీచాలని జీతాలతో దుర్భర జీవితాలు గడుపుతున్నామని పాదయాత్రలోనూ, ఎన్నికల సమయంలోనూ వేతనాల పెంపు, ఇతర సమస్యల పరిష్కారానికి హామీనిచ్చిన సిఎం జగన్, ఇపుడు కక్షపూరిత ధోరణితో వ్యవహరించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎల్ సత్యవతి, రాజేశ్వరి, వీరయమ్మ, రమణి, రమణ, వీరలక్ష్మి, మంగ, లక్ష్మి, చిన్నమ్మలు, రాధ, భవాని పాల్గొన్నారు.

గంగరాజు, బాలదేవ్ హౌస్ అరెస్ట్

ప్రజాశక్తి- అనంతగిరి:అంగన్వాడీలకు కనీస వేతనం, ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే మరింత పోరాటాలు ఉధృతం నిర్వహించక తప్పదని అనంతగిరి సిపిఎం జెడ్పిటిసి దీసరి గంగరాజు తెలిపారు. అంగన్వాడీల చలో విజయవాడలో భాగంగా ఆదివారం తన ఇంటికి వెళ్లిన పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం పట్ల ఆయన మండిపడ్డారు అంగన్వాడీలు సమ్మె చేపడుతూ 40 రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు లేదని విమర్శించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చి కనీస వేతనంతో పాటు ఇతర బెనిఫిట్స్ మలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అరకులోయ:అంగన్వాడీల సమ్మె సందర్భంగా చలో విజయవాడ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తుంది. అరకులోయలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ చలో విజయవాడకు వెళ్తారన్న అనుమానంతో ఆదివారం పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం చేయాల్సింది పోయి ఆదివాసుల పక్షాన పోరాడుతున్న ఉద్యమకారులపై నిర్బంధం ప్రయోగించడం సరికాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరిని విడనాడి అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో అంగన్వాడీల పట్ల అమానుషంగా వ్యవహరించి గుర్రాలతో తొక్కించారని, ఇపుడు జగన్మోహన్ రెడ్డి అదే పంథాలో వెళ్తున్నారని ఆయన విమర్శించారు. వీరిద్దరి పాలనలో తేడా ఏముందని ఆయన ప్రశ్నించారు.

పోలీసుల అదుపులో ఉన్న గంగరాజు, బాలదేవ్

సారెను ఊరేగిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, భక్తులు

ఘనంగా మోదకొండమ్మ తీర్థం

-సాంస్కృతిక ప్రదర్శనలతో అమ్మవారి ఊరేగింపు

ప్రజాశక్తి -పాడేరు:పాడేరులో మోదకొండమ్మ అమ్మవారి సంక్రాంతి తీర్థ మహోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలతో భక్తులకు దర్శనం కల్పించారు. విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సుభద్ర దంపతులు మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు వీరిని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఆలయ లాంఛనం ప్రకారం శాలువాతో సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఆలయ కమిటీ చైర్పర్సన్ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయం వద్ద ముగ్గుల పోటీలు, అన్నప్రసాద కార్యక్రమం, అమ్మవారి సారే సమర్పణ నిర్వహించారు. కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళలు సారే ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పాదాలను పల్లకిలో ఊరేగించారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో అమ్మవారి పల్లకి సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీల లో విజేతలకు ఆలయ కమిటీ అందించిన నగదు బహుమతులతో పాటు సంతూర్ సోప్స్ కంపెనీ గిఫ్ట్ యాంపర్స్ పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మెడికల్ కౌన్సిల్ సభ్యులు టి.నర్సింగ్ రావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సింహాచలం నాయుడు, ఉపసర్పంచ్ భూరెడ్డి రాము పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలో అభివృద్ధి శూన్యం

-ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

ప్రజాశక్తి- అరకు లోయ : పద్నాలుగు సంవత్స రాలు ముఖ్యమంత్రిగా ఉండి, నలభై సంవత్సరాలు సుదీర్ఘ రాజకీయం కలిగిన చంద్రబాబు హయాంలో మన్యాన్ని అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని ఎమ్మెల్సీ డాక్టర్ కుంభ రవిబాబు తెలిపారు. అరకు బహిరంగ సభలో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు వైసిపి ప్రభుత్వం పై విమర్శించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్లో విలేకరులతో మాట్లాడుతూ, గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి మూలమైన నాణ్యమైన విద్యను అందించడంలో చంద్రబాబు నాయుడు పూర్తిగా విఫలమయ్యారని ఆయన విమర్శించారు. ఆదివాసీ బిడ్డలకు పోడు పంపిణీ చేసిన ఘనత వైసిపికే దక్కుతుందన్నారు.గిరిజన సంక్షేమానికి, అభివద్ధికి టిడిపి ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అభివృద్ధి సంక్షేమ పథకాలతో పాటు రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల, రాష్ట్రంలో గిరిజన ప్రాంతాలలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, ట్రైబల్ యూనివర్సిటీ, ట్రైబల్ ఇంజనీరింగ్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. పెదబయలు, జీ.మాడుగుల వంటి మారుమూల ప్రాంతాలలోని గ్రామాలకు రహదారులు నిర్మించాలన్నారు. చంద్రబాబు నాయుడు నిరాధారమైన విమర్శలు చేస్తే గిరిజన ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని వైసిపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆయన విమర్శించారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి అండ

ఇంటి నిర్మాణ సామగ్రి వితరణ చేసిన జమాల్‌ఖాన్ ట్రస్ట్

సిమెంట్ రేకులు అందజేస్తున్న జమాల్‌ఖాన్

ప్రజాశక్తి-చింతూరు : అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన గిరిజన కుటుంబానికి డాక్టర్ జమాల్‌ఖాన్ ఛారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. ఇంటి నిర్మాణానికి రూ.32వేలు విలువైన సిమెంట్ రేకులు ఇనుప పైపులు వితరణగా అందజేశారు. మండలంలోని పేగ పంచాయతీ అల్లిగూడెం గ్రామంలో ఈనెల 11న జరిగిన అగ్ని ప్రమాదంలో మడకం సీతయ్య అనే గిరిజనడి ఇల్లు కాలిబూడిదైంది. ఇంట్లోని నిత్యాసరరాలు, వంటసామగ్రి, బట్టలు సర్వం అగ్నికి ఆహుతైంది. బాధితకుటుంబం నిరాశ్రయులై రోడ్డున పడ్డారన్న సమాచారం తెలుసుకున్న ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నిలువనీడ లేక రోడ్డున పడి,ఆరుబయట పరదాలు కట్టుకొని చలిలో ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబానికి ఇంటి నిర్మాణానికి తన ట్రస్ట్‌ద్వారా సిమెంటు రేకులు ఐరన్ పైపులను శనివారం అందజేశారు. కార్యక్రమంలో జెకె సిటీ ట్రస్ట్ ఇన్‌ఛార్జి సుభాని, గ్రామ పెద్దలు నాసిర్ పాల్గొన్నారు.

బాధితులను పరామర్శిస్తున్న జమాల్‌ఖాన్

గిరిజనేతరుని పెట్రోల్ బంక్ తొలగింపు

- లక్ష్మీదేవిపేటలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం
- ఫలించిన ఆదివాసీ గిరిజన సంఘం పోరాటం
- అనంతబాబు అండతో చేపట్టిన ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణలన్నీ తొలగించాల్సిందే : అర్జున్‌దొర

ప్రొక్లెయినర్‌తో పెట్రోల్ బంక్ తొలగింపు

ప్రజాశక్తి -ఎటపాక : మండల కేంద్రంలోని లక్ష్మీదేవిపేట రెవిన్యూ పరిధిలో ప్రధాన రహదారికి ఆనుకుని అక్రమంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకును శనివారం రాత్రి అధికారులు తొలగించారు. లక్ష్మీదేవిపేట రెవిన్యూ పరిధిలోని 15 ఎకరాల స్థలాన్ని తెలంగాణ ప్రాంతానికి చెందిన గిరిజనులు ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయమై ఆదివాసీ గిరిజన సంఘాలు ఆందోళన చేయగా, ఎల్‌టిఆర్ కేసు నమోదు చేశారు. గిరిజనేతరుడు నుంచి మరో గిరిజనేతరుడికి భూబదలాయింపు జరిగిందని, దొడ్డిదారిన జిఒ తెచ్చుకొని పెట్రోల్ బంకు నిర్మాణం చేపట్టడాన్ని సవాల్ చేస్తూ కొందరు గత ఆగస్టులో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ స్వీకరించి, విచారణ చేపట్టిని న్యాయస్థానం షెడ్యూల్ ప్రాంతంలో భూబదలాయింపు, గిరిజనేతరులకు పట్టాదారుపాసు పుస్తకాల జారీ వంటివి చెల్లవని పేర్కొంటూ అక్రమదారులు తెచ్చుకున్న జిఒపై స్టే విధించింది.

తొలగించిన పెట్రోల్ పోసే యంత్ర పరికరం

అయినప్పటికీ, ఆక్రమణదారు కొండిశెట్టి నాగేశ్వరరావు కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ పెట్రోల్ బంక్ నిర్మాణ పనులను చేపట్టారు. దీనిపై ఆదివాసీ గిరిజన, ప్రజాసంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేయగా శనివారం రాత్రి రెవెన్యూ అధికారులు పెట్రోల్ బంక్ నిర్మాణాలను అడ్డుకొని తొలగించారు.

ఆదివాసీ గిరిజన సంఘం హర్షం

ఏజెన్సీలో గిరిజనేతరులు అక్రమంగా చేపట్టిన పెట్రోల్ బంక్ నిర్మాణ పనులను అధికారులు అడ్డుకోవడంపై ఆదివాసీ గిరిజన సంఘ రాష్ట్ర కమిటీ సభ్యుడు కాకా అర్జున్ దొర హర్షం వ్యక్తం చేశారు. ఏజెన్సీలో ప్రభుత్వ భూములు అన్యాకాంతమవుతున్నాయని, ఉల్లంఘనలకు గురౌతున్న 1/70, ఇతర గిరిజన చట్టాలను పగడ్బందీగా అమలు చేయాలని కోరారు. అధికార పార్టీ అండతో కొండుశెట్టి నాగేశ్వరావు భూకబ్జాలకు పాల్పడుతున్నాడని, అతను ఆక్రమించుకున్న భూములు స్వాధీనం చేసుకొని గిరిజనులకు పంచాలని కాక అర్జున్ దొర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ అనంతబాబు అండతో ప్రభుత్వ భూములను ఆక్రమించాలని చూస్తే నష్టపోక తప్పదని హెచ్చరించారు. అక్షయ ఫంక్షన్ హాల్ వెనుక భాగంలో నిర్మిస్తున్న కట్టడాలను కూడా కూల్చేయాలని అధికారులకు డిమాండ్ చేశారు.

200 మందికి ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి -రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 200 మందికి వైద్య సేవలు అందించినట్లు మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. వైద్యశిబిరంలో డాక్టర్ ఉమా మహేష్, తలారి వెంకట సుబ్బారావు. ఎస్.సంపత్ కుమార్ పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు చేశారు. ఈసందర్భంగా 58మందికి రక్తపరీక్షలు, ఏడుగురికి థైరాయిడ్ పరీక్షలు, ఏడుగురికి ఎక్స్‌రేలు, 11మందికి ఫిజియథెరపీ చేశారు. అలాగే వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 23మందికి కంటి పరీక్షలు చేశారు. ఐదుగురికి ఉచితంగా కళ్లద్దాలను అందజేశారు. దృష్టిలోపం వున్న ఒకరిని గుర్తించి, అపరేషన్ కోసం తరలించారు.

ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ, .రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, నక్కా చంటిబాబు సిబ్బంది పాల్గొన్నారు. శిబిరానికి వచ్చిన రోగులకు, సహాయకులకు భోజన సదుపాయం కల్పించారు.

వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

చాపరాయిలో పర్యాటకుల సందడి

సందర్శకులతో కిటకిటలాడుతున్న చాపరాయి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చారు. పర్యాటకులతో చాపరాయి జలపాతం కిటకిటలాడింది. సందర్శించిన పర్యాటకులు జలపాతంలో సరదాగా స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. నూతనంగా ఏర్పాటుచేసిన గార్డెన్‌లో ఫోటోలు తీసుకుంటూ పర్యాటకులు సందడి చేశారు.

టిడిపి ఫ్లెక్సీలకు చిల్లులు!

మాయమౌతున్న పార్టీ మండల అధ్యక్షుని ఫొటోలు

విభేదాలు సృష్టించేందుకు అంటున్న టిడిపి శ్రేణులు

గుర్తు తెలియని వ్యక్తులు చించేసిన ఫ్లెక్సీ

ప్రజాశక్తి -చింతూరు : చింతూరు డివిజన్ కేంద్రంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన పలు ఫ్లెక్సీలకు చిల్లులు పడుతున్నాయి. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఇల్లా చిన్నారెడ్డి ఫోటో ఉన్న వరకు మాత్రమే కత్తిరించి, మిగతా ఫ్లెక్సీని యథాతథంగా ఉంచుతున్నారు. స్థానిక తెలుగుదేశం కార్యాలయం వద్ద బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ పేరుతో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలోని మండల తెలుగుదేశం అధ్యక్షుడు ఫోటోను కత్తిరించారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన తెలుగుదేశం, జనసేన పార్టీలు ఉమ్మడిగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలోనూ ఇదే మాదిరిగా సగం వరకు కత్తిరించి వదిలివేశారు. ఈ ఫ్లెక్సీలను ఎవరు ధ్వంసం చేస్తున్నారో అర్థం కాక తెలుగు తమ్ముళ్లు తలలు పట్టుకుంటున్నారు. అధికార వైసిపి ఫ్లెక్సీలు మాత్రం నెలల తరబడి చెక్కుచెదరకుండా ఉంటున్నాయి. టిడిపి, జనసేన ఫ్లెక్సీలకు మాత్రం కత్తిరిస్తుండడం, అందులోనూ పార్టీ మండల అధ్యక్షుడు ఫొటో మాయం చేస్తుండడాన్ని బట్టి సొంత పార్టీలోనే అసమ్మతీయులు ఇలా చేస్తున్నారా? లేక టిడిపిలో ముసలం పుట్టించడానికి విపక్షం ఇలా చేస్తోందా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో విభేదాలతో సొంతపార్టీ వారే ఈ పనికి పూనుకుంటే పార్టీకి నష్టమని, ఏమైనా విబేధాలుంటే కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకోవాలే తప్ప, ఇలా ఫ్లెక్సీలను చించడం సరికాదని, దీని వల్ల పార్టీకి నష్టం కలుగుతుందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. అదే సమయంలో టిడిపిలో విబేధాలు సృష్టించడం ద్వారా రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న దురుద్దేశ్యంతో విపక్షాలేమైనా ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారేమో అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేవలం టిడిపి మండల అధ్యక్షుడు ఫొటో వరకు మాత్రమే చించేస్తుండడంపై నిఘా పెట్టి పనిపట్టాలని, రానున్న ఎన్నికలకు సమిష్టిగా సంసిద్ధం కావాలని తెలుగుదేశం అభిమానులు కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

అసంపూర్తిగా పాఠశాల భవనం

పూటకో ఇంటి వరండాలో చదువులు.. విద్యార్థుల అవస్థలు

ఏళ్ల తరబడి పిల్లర్లతోనే ఆగిపోయిన పాఠశాల భవనం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని కొర్ర పంచాయతీ బలియాగుడా గ్రామంలో పాఠశాల భవనం పునాది దశలోనే నిలిచి పోయింది. పాఠశాల భవనం నిర్మాణానికి గతంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఏళ్ళ గడుస్తున్నప్పటికీ ఆ పాఠశాల భవనం పునాది దశలోనే నిలిచిపోయింది. అసంపూర్తిగా నిలిచిపోయిన ఈ భవనాన్ని పూర్తిగా నిర్మించాలని ఆ గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు పలుమార్లు సంబంధిత ఉన్నత స్థాయి అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలలో సుమారు 20 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల భవనం లేక పోవడంతో ఆ గ్రామంలోని ఓ నివాస గృహంలోని వరండాలో తరగతులు నిర్వహిస్తున్నారు. వేసవి, శీతాకాలంలో తరగతులు సాఫీగా జరుగుతున్నా వర్షాకాలంలో నిర్వహణకు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు వరండా తడిసిపోయి ఉండటంతో విద్యాబోధన చేయడానికి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా తక్షణమే అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాన్ని పూర్తిగా నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బోయ/వాల్మీకిలపై చంద్రబాబు ప్రకటన చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:అరకులో నిర్వహిం చిన రా కదలిరా బహిరంగ సభలో తెలుగుదేశం అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీవో 3 రిజర్వేషన్ కు చట్టబద్ధత కల్పించి స్థానిక ఆదివాసీ యువతకు ఉద్యోగం ఉపాధి కల్పిస్తామని హామీ ఇవ్వడం పై ఆదివాసి గిరిజన సంఘం హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ అన్నారు.ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, జీవో 3 పునరుద్ధరణ చేయాలని ఆదివాసులు జగన్ ప్రభుత్వానికి ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు.బోయ/వాల్మీకిపై చంద్రబాబు మౌనం ఎందుకని ప్రశ్నించారు.బోయ వాల్మీకి లను ఎస్టీ జాబితాలో చేర్పించే అర్హత లేకపోయినా ఓట్లు కోసం టీడిపి ప్రభుత్వం మొదట్లో అసెంబ్లీలో తీర్మానం చేసిందని, దీనిపై గిరిజనులకు చంద్ర బాబు స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. బోయ వాల్మీకి విషయం పై జగన్ మోహన్ రెడ్డి, చంద్ర బాబు నాయుడు వైఖరి ఒకటేన విమర్శించారు. ఆదివాసి గిరిజనులు అవకాశవాద రాజకీయ పార్టీలకు దూరంగా ఉండాలని కోరారు.ఆదివాసి స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ ఇచ్చి పాడేరు ఐటిడిఏ పరిధిలో ఉన్న గిరిజన ఆశ్రమ, మండల పరిషత్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు కె.జగనాదం, బుజ్జిబాబు పాల్గొన్నారు.

టిడిపిలో వైసిపి సర్పంచ్ చేరిక

టిడిపిలో చేరిన కృష్ణతో దొనున్నదొర

ప్రజాశక్తి - హుకుంపేట:మండలంలోని పట్టాం పంచాయతీ వైసిపి సర్పంచ్ కించాయి కృష్ణ శనివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.తెలుగు దేశం తలపెట్టిన రా కదిలిరాలో అరుకు ఇంచార్జి సివేరి దొన్నుదొర ఆధ్వర్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో పట్టాం వైసిపి చర్పంచ్ కించాయి కృష్ణ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రస్తుతం గ్రామ సర్పంచ్‌లకు నిధుల కేటాయింపు చేయకపోడం, గ్రామ స్థాయి సమస్యలు పరిష్కరించక పోవడంతో చేరినట్లు సర్పంచ్ కృష్ణ తెలిపారు.టీడీపీకి ప్రభుత్వం హయాంలో గ్రామ స్థాయి అబివృద్ధి జరిగిందన్నారు.

94 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలో ఎన్నికలకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు స్థానిక తహసీల్దార్ చిరంజీవి పడల్ ఆదివారం తన ఛాంబర్ లో విలేకరులకు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పెదబయలు మండలంలో 23 పంచాయతీలకు గాను 94 ఎన్నికల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 5305 కొత్త ఓటర్లు నమోదయ్యారని, 2074 ఓటర్ల మృతి చెందారని, వలస వెళ్లిన వారిని తొలగించామన్నారు. మండలంలో సుమారు 40 వేల ఓటర్లు ఉన్నారన్నారు.

ఎయుకు రూ1.30 కోట్లు విలువైన ప్రయోగశాల పరికరాలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయానికి ఉపయుక్తంగా నిలిచే రూ 1.30 కోట్లు విలువైన ప్రయోగశాల ఉపకరణాలను వయాట్రిస్ ఫార్మశీ సంస్థ తరపున అందిస్తున్నట్లు ఆ సంస్థ క్వాలిటీ ఇన్వెస్టిగేషన్స్-రెగ్యులేటరీ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ దేవ పురాణం తెలిపారు. ఈ మేరకు తమ సంసిద్ధతను ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డికి తెలియజేశారు. వయాట్రిస్ సంస్థ సిఎస్ఆర్ విధానంలో భాగంగా వయాట్రిస్ ఇండియా అధిపతి మిచెల్ డొమినికా నేతృత్వంలో ప్రయోగశాల ఉపకరణాలను ఏయూకు అందిస్తున్న విషయం దేవ పురాణం ప్రకటించారు. వర్సిటీకి ఉపయుక్తంగా నిలచే హెచ్‌పిఎల్‌సి, స్పెక్ట్రోఫోటోమీటర్స్, హ్యూమిడిటి అండ్ కూలింగ్ చాంబర్స్, ఎలక్ట్రానిక్ అనలిటికల్ బ్యాలెన్సెస్, సెంట్రిఫ్యూజిస్, పోలరీమీటర్, రిఫ్రాక్టోమీటర్, వాటర్ ప్యూరిఫికేషన్ సిస్టమ్ వంటివి ఏయూకు అందిస్తారు. ఈ పరికరాలను ఏయూ ఫిజికల్ కెమిస్ట్రీ, ఫార్మశీ, ఎలిమెంట్ (ఏ సెంట్రల్ హై ఎండ్ ఇనుస్ట్రుమెంట్ ల్యాబ్)లలో వినియోగించాలని సూచించారు. త్వరలో వీటిని స్వయంగా ఏయూకు అందిస్తామన్నారు.

విశాఖలో జరిగిన సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

మహనీయుడు లెనిన్

- శత వర్ధంతి సభల్లో వక్తలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రపంచంలో దోపిడీ రాజ్యాలను కూల్చి కార్మిక రాజ్యాలు స్థాపించిన నాడే ప్రజలకు దోపిడీ నుండి విముక్తి కలుగుతుందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎంవిఎస్.శర్మ అన్నారు. సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జగదాంబ దరి నండూరి ప్రసాదరావు భవనంలో లెనిన్ శత వర్ధంతి సభ పార్టీ సీనియర్ నాయకులు జిఎస్.రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సభ ప్రారంభానికి ముందు లెనిన్ చిత్రపటానికి శర్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, సీనియర్ నాయకులు పెతకంశెట్టి వెంకటరెడ్డి, జిఎస్.రాజేశ్వరరావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ మార్క్స్, ఎంగెల్స్ సిద్ధాంతాన్ని లెనిన్ ఆచరణలో పెట్టి రష్యాలో దోపిడీ వ్యవస్థను కూల్చి కార్మికవర్గ రాజ్యాన్ని స్థాపించి నాయకత్వం వహించారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మానవాళికి విముక్తి కలిగించే విధంగా కృషి చేసిన వ్యక్తి లెనిన్ అని తెలిపారు. కార్మిక రాజ్యం స్థాపించడం ఒక్క కార్మికులతోనే సాధ్యం కాదని, దానికి కార్మిక, కర్షక మైత్రి చాలా అవసరమని భావించి దానిని ఆచరణలో పెట్టిన గొప్ప నాయకుడు ఆయనని తెలిపారు.

కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని అమలు జరిపి ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన సాగించారన్నారు. 1917లో రష్యాలో విప్లవం సాధించి సుదీర్ఘకాలం ప్రజాపరిపాలన సాగించారన్నారు. రష్యాలో సోషలిస్టు ప్రభుత్వం వచ్చాక భారతదేశంలో భారీ పరిశ్రమలు పెట్టేందుకు యంత్రాలను ఇచ్చి తోడ్పాటు అందించిందన్నారు. నేడు భారతదేశంలో మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని అమ్మేయడం లేదా మూసివేసే పనిలో ఉందన్నారు. పెట్టుబడిదారులకు లాభాల కోసం పనిచేస్తున్న దోపిడీ ప్రభుత్వాలను కూల్చి కార్మిక రాజ్యం స్థాపన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ లెనిన్ సామ్రాజ్యవాద గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన గొప్ప మహనీయుడన్నారు. భారతదేశానికి రష్యా చేసిన సహాయాన్ని గుర్తుచేశారు. ఈ ఏడాది పొడువునా లెనిన్ శత వర్ధంతి సభలు జరిపి పెట్టుబడిదారీ వ్యవస్థకు, సోషలిస్టు వ్యవస్థగల తేడాలను ప్రజలకు వివరించాలన్నారు.

ప్రజాశక్తి, విశాలాంధ్ర ఆధ్వర్యాన..

విశాలాంధ్ర, ప్రజాశక్తి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో లెనిన్ శత వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముందుగా శత వర్ధంతి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కవితలను వినిపించారు. మొదటి కవితగా 'కర్తవ్యం' చదివారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎంవిఎస్.శర్మ హాజరై మాట్లాడారు. అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ కార్మిక, కర్షక వ్యతిరేక ప్రభుత్వాలు ఉన్నాయని చెప్పారు. కేంద్రంలో మోడీ నాయకత్వంలో నిరంకుశ ప్రభుత్వం నడుస్తోందని, దీనిని ఎదుర్కోవాల్సి ఉందని అన్నారు. సిపిఐ జిల్లా నాయకులు సిఎన్.క్షేత్రపాల్ మాట్లాడుతూ మార్క్సిజం దివిటీని చేతబట్టి ప్రపంచానికి దారి చూపిన మహానేత లెనిన్ అని కొనియాడారు. సమావేశంలో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు పాల్గొన్నారు.

సిపిఐ కార్యాలయంలో....

సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన సభలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, జిఎస్‌కె.అచ్యుతరావు, సిఎన్.క్షేత్రపాల్, పి.చంద్రశేఖర్, ఎస్‌కె.రెహమాన్ పాల్గొన్నారు.

చంద్రబాబును గిరిజనులు నమ్మరు

పాడేరు శాసనసభ్యులు భాగ్యలక్ష్మి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-పాడేరు: 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిని పట్టించుకోని చంద్రబాబు గెలిపిస్తే ఆదివాసీలను ఉద్ధరిస్తానని కల్లబొల్లి కబుర్లు చెప్పినా గిరిజ నలెవ్వరూ నమ్మబోరని పాడేరు శాసనసభ్యులు, అరకు పార్లమెంటు వైయస్సార్సీపి సమన్వయకర్త కొట్టగుల్లి భాగ్యలక్ష్మి విమర్శించారు. ఈ విషయం అందరికీ తెలుసునని గిరిజనులు ఎట్టి పరిస్థితుల్లోనూ మోసగాళ్లను వారి దరికి కూడా చేరనివ్వరని ఆమె అన్నారు. అరకులోని రా కదలిరా బహిరంగ సభలో ప్రభుత్వంపై ఆయన విమర్శలు చేసిన నేపథ్యంలో భాగ్యలక్ష్మి తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసం గిరిజనులను మోసం చేయడం కోసం మరో కొత్త అవతారం ఎత్తారని విమర్శించారు. చంద్రబాబు కల్లబొల్లి మాటలను అమాయక గిరిజనులు నమ్మి మోసపోవద్దని సూచించారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రి కాలంలో గిరిజన పంటలకు ఎన్నిసార్లు మద్దతు ధర ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు సంక్షేమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రం ద్వారా అందుతున్న సేవల రూపంలోనూ మనకు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గిరిజనులకు లక్షలాది ఎకరాలకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చి అండగా నిలిచారన్నారు. గిరి పుత్రిక కళ్యాణం పేరుతో నాడు కేవలం రూ. 50వేలు మాత్రమే ఇచ్చేవారిని ప్రస్తుతం ఎస్టీ మహిళలకు లక్ష రూపాయలు కళ్యాణ మస్తు కింద అందిస్తుందని తెలిపారు. కులాంతర వివాహం చేసుకుంటే 1.20లక్షలు అందించి ఆదుకుంటున్నామని వివరించారు.ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రతి గ్రామాలలో రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. సుమారు 2వేల సెల్ టవర్లు ఏర్పాటు చేశామని ఇప్పటికే వెయ్యి టవర్‌లు అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాడేరు మండల అధ్యక్షులు సీదరి రాంబాబు, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు చిట్టిబాబు, ఎంపిటిసి కుంతూరు నరసింహమూర్తి, కన్నాపాత్రుడు, చింతపల్లి మండల అధ్యక్షులు మోరి రవి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి రెబల్ అభ్యర్థిగా పోటీకి సిద్ధం

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు సివేరి అబ్రహం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:టిడిపి రెబల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తానని అరకు నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు సివేరి సోమ తనయుడు, రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమీషన్ మాజీ సభ్యుడు సివేరి అబ్రహం స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆధివారం ఆయన నివాస గృహంలో స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తన తండ్రి సాధారణ సామాన్య కార్యకర్త నుండి పంచాయతీ సర్పంచ్, మండల స్థాయి నుండి ఎమ్మెల్యేగా స్థాయి వరకు ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేసారన్నారు. మా నాన్న పార్టీకోసం ప్రాణాలు అర్పించారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అరకులో రా కదలిరా సభలో అరకు అసెంబ్లీ అభ్యర్థిని వేరే వ్యక్తిని ప్రకటించి తీవ్రంగా మోసం చేసారని ఆవేదన వ్యక్తంచేశారు. చంద్రబాబు నాయుడు తమ కుటుంబానికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. రాత్రి పగలు కష్టపడి పార్టీ బలోపేతానికి కృషి చేసిన తమకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి తాము చేసిన కృషి చంద్రబాబు నాయుడుకు కనిపించలేదని ఆయన తెలిపారు.తమను సంప్రదించకుండా నియోజక వర్గం అభ్యర్థి ప్రకటించడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సోమ సతీమణి ఇచ్ఛావతి, కుమారుడు ఎస్.సురేష్ కుమార్, టిడిపి నాయకులు శాస్త్రి బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అబ్రహం

బాలోత్సవాన్ని జయప్రదం చేయాలి : జనవిజ్ఞాన వేదిక

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్: విద్యార్థుల్లో పెరుగుతున్న ప్రతిభా పాటవాలతో ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నారని, వాటిని ప్రదర్శించే వేదికలు కల్పించడమే ప్రధాన లక్ష్యం అని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.త్రిమూర్తులు తెలిపారు. ఆదివారం శారద నగర్‌లోని విశాఖ జిల్లా నవనిర్మాణ సమితి మీటింగ్ హాల్లో జరిగిన బాలోత్సవం కమిటీ ప్రథమ సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలోత్సవం కమిటీ నిర్ణయాలను ఆయన తెలియజేశారు. బాలోత్సవంలో ప్రజలందరినీ భాగస్వాములను చేసి పిల్లల పండగలా జరపాలని బాలోత్సవానికి అల్లూరి సీతారామరాజు పేరు నామకరణం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. బాలోత్సవం కమిటీకి గౌరవ అధ్యక్షులుగా దస్త్రాల రాఘవేంద్రరావు, అధ్యక్షులుగా లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ అధికారి గోపాలరావు, కార్యదర్శిగా కె.త్రిమూర్తులను నిర్ణయించడం జరిగింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల బాలబాలికలు వేదికగా ఉండాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. విద్యార్థులకు అకడమిక్‌లో 12 అంశాలపై కల్చరల్ లో ఎనిమిది అంశాలపై పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బాలోత్సవాలలో మండలంలోని 60 పాఠశాల నుండి 2000 మంది విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన వచ్చునని కమిటీ అభిప్రాయబడింది. ఈ సమావేశంలో విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు, విశ్రాంత తెలుగు లెక్చరర్ జెట్టి ఎల్లమంద, విశ్రాంత పోస్టల్ అధికారి రామారావు, సీనియర్ జర్నలిస్ట్ పి.వి.సత్యనారాయణరావు, విశ్రాంత ఎల్ఐసి అధికారి టి.వెంకటేశ్వరరావు, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

కొణతాలకు ఎంపీ సీటు

ఆ భరోసాతోనే జనసేనలో చేరిక

'పొత్తు' లెక్కలతో అయోమయంలో టిడిపి ఆశావహులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

దాదాపు పదేళ్లపాటు ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగావున్న మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించి పున:ప్రవేశం చేశారు. కొద్ది రోజుల క్రితం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కొణతాల కలిసినప్పుడే ఆ పార్టీలో చేరతారన్న ప్రచారం బలంగా జరిగింది. అవన్నీ ఊహాగానాలేనని కొట్టిపారేసినా అనకాపల్లి పట్టణంలోని పెంటకోట కన్వెన్షన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన అభిమానుల ఆత్మీయ సమావేశంలో త్వరలో అభిమానులతో కలిసి జనసేనలో చేరుతున్నట్లు ఆయన వెల్లడించడంతో ఊహలకు తెరపడింది. ఆయనకు ఆ పార్టీ ఎంపీ సీటు కేటాయించనున్నట్లు తెలుస్తోంది.

ఏ పార్టీలో చేరాలన్న నిర్ణయంపై చాలా కాలంపాటు కొణతాల ఊగిసలాడారు. చివరకు తనకు ఒక గుర్తింపు, రాజకీయ భవిష్యత్తు వుంటుందని జనసేన పార్టీని ఎంచుకున్నారు. కొద్ది రోజుల క్రితం నూతన సంవత్సరం, సంక్రాంతి పండగ అభినందనలు తెలుపుతూ వైసిపి ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై మీడియాతో మాట్లాడి ఎన్నికలకు ముందు తాను రాజకీయాల్లోకి వస్తానన్న సంకేతాలను ఆయన పరోక్షంగా ఇచ్చారు. ఈ క్రమంలోనే తొలుత టిడిపిలో చేరతారని ఆయన అనుచరులు ప్రచారం చేశారు. అయితే కాంగ్రెస్‌లోకి వెళ్లాలని కొణతాల అనుకున్నారు. ఏ పార్టీలో చేరుతానన్నది కొణతాల ప్రకటించేలోపు మాజీ మంత్రి దాడి వీరభద్రరావు తన తనయులతో కలిసి వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. దీంతో సందిగ్ధంలో పడ్డ కొణతాల కొంత వ్యవధి తీసుకొని తన రాజకీయ భవిష్యత్‌పై అంచనా వేసుకొని పవన్ కల్యాణ్‌ను కలిశారు. ఈ క్రమంలోనే జనసేనలో చేరుతున్నట్లు అభిమానుల మధ్య ప్రకటించారు. రాజకీయంగా ఒక పార్టీలో ఇమడలేని కొణతాల, దాడి వేర్వేరు పార్టీల్లో చేరి తమ పట్టు నిలుపుకొనేందుకు ఎవరి ప్రయత్నాలు వారు ప్రారంభించారు.

జనసేన చేరికలో వ్యక్తిగత అజెండా లేదని, ఉత్తరాంధ్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఆ పార్టీలో చేరుతున్నానని కొణతాల చెబుతున్నా, వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ సీటు ఇస్తామన్న భరోసాతోనే జనసేనలో చేరినట్లు ప్రచారం జరుగుతోంది.

టిడిపి, జనసేన పొత్తులో అనకాపల్లి ఎంపీ స్థానం జనసేనకు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. అనకాపల్లి ఎంపీగా తన తనయుడు విజయ్‌ను బరిలోకి దించాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అయ్యన్నపాత్రుడు ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు బైరా ఫౌండేషన్ ఛైర్మన్ బైరా దిలీప్ చక్రవర్తి ఆశ పడుతున్నారు. దాడి వీరభద్రరావు తన తనయుడు రత్నాకర్‌కు ఎంపీ సీటు కోసం ప్రయత్నం చేస్తున్నట్లు ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. టిడిపి అధినేత చంద్రబాబు వ్యూహాత్మకంగా పొత్తులో భాగంగా అనకాపల్లి ఎంపీ సీటును జనసేనకు కేటాయించి, ఈ తలనొప్పుల నుంచి బయటపడాలన్న ఆలోచనలో వున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో పవన్ నుంచి ఆ హామీతోనే కొణతాల జనసేనలో చేరాలన్న నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం వుంది.

మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ

ప్రగతి పథాన ఎన్ఎస్ఇ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : ప్రపంచంలోనే అతిపెద్ద మూడో డెరివేటివ్ ఎక్స్ఛేంజర్‌గా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ) ముగిసిన 2023వ సంవత్సరానికిగానూ ఈక్విటీ సెగ్మెంట్‌లో గుర్తింపు సాధించిందని ఆ సంస్థ బిజినెస్ డవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీరామ్ కృష్ణన్ వెల్లడించారు. విశాఖలోని ఓ కార్యక్రమంలో ఆ వివరాలను ఆయన వెల్లడించారు. 2023లో ట్రేడ్‌ల సంఖ్య అంటే ఎలక్ట్రానిక్ ఆర్డర్ బుక్స్ ప్రకారం ఈక్విటీ విభాగంలో ప్రపంచంలోనే మన దేశంలోని ఎన్ఎస్ఇ మూడో స్థానం సాధించిందని, ఈ విషయాన్ని వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ఎక్స్ఛేంజ్ (డబ్ల్యూఎఫ్ఇ) ప్రకటించినట్లు తెలిపారు. లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ (యుఎస్‌డి) 4 ట్రిలియన్లను అధిగమించి ఎస్ఎంఇ లిస్టెడ్ కంపెనీలు రూ.లక్ష కోట్లు మార్కును దాటి, నిఫ్టీ 50 ఇండెక్స్ మొదటసారిగా 20 వేల ఇండెక్స్ అధిగమించి అనేక మైలురాళ్లను దాటిందన్నారు. 2024లో ప్రత్యేకంగా ఎన్ఎస్ఇలో 8.5 కోట్ల మంది పెట్టుబడిదారుల సంఖ్యను చేరిందన్నారు. ఈ ఏడాదే కొత్తగా లాభాపేక్ష లేని సంస్థలు (ఎన్‌పిఒ)లు 42 వరకూ రిజిస్ట్రేషన్లు జరిగాయని ప్రకటించారు.

తల్లిదండ్రుల చెంతకు అవినాష్ కుమార్ సోను

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టం రావడంతో, మానసిక స్థితి దెబ్బతిని, కుటుంబ సభ్యులు ఎవరికీ చెప్పకుండా ఈ నెల 19న రైలులో జార్ఖండ్ రాష్ట్రం రాంచీకి చెందిన అవినాష్ కుమార్ సోను విశాఖకు రాగా ఆయన్ని తల్లిదండ్రుల చెంతకు ఎయుటిడి నిర్వాహకులు, పోలీసులు చేర్చారు. తొలుత రాంచీలోని సోను బంధువులు అక్కడి రైల్వే పోలీసులకు సోను కనిపించని సమాచారం అందించారు. అక్కడి పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు విశాఖపట్నంలో ఆర్‌పిఎఫ్ సిబ్బంది అవినాష్ కుమార్ సోనును గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఎయుటిడి వారికి సమాచారం ఇవ్వడంతో వారు ఆయనను జివిఎంసి హోం లెస్ షెల్టర్‌కు రప్పించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆయన పరిస్థితి మెరుగుపడటంతో అతని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు మనోజ్ సోను, సరోజినీ దేవి ఆదివారం ఇక్కడకు వచ్చి ఎయుటిడిలో ఉన్న కుమారుడిని కలిశారు. ఎయుటిడి, ఆర్‌పిఎఫ్ వారికి వారు ధన్యవాదాలు తెలిపారు.

భూ యాజమాన్య హక్కుల చట్టాన్ని రద్దుచేసే వరకూ పోరాటం : అడ్వకేట్స్ జెఎసి

ప్రజాశక్తి-లీగల్ : ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన ప్రజా ఆస్తులకు వ్యతిరేకమైన భూ యాజమాన్య హక్కు చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేసే వరకూ ఈ పోరాటం ఆగదని, నిరవధికంగా నడిపిస్తామని ఉత్తరాంధ్ర అడ్వకేట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆదివారం విశాఖపట్నంలో న్యాయవాదుల సంఘం గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో తీర్మానించారు. విశాఖపట్నం న్యాయవాదుల సంఘం స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ బెవర సత్యనారాయణ ఆధ్వర్యాన న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతపల్లి రాంబాబు మాట్లాడుతూ, ఈ భూ యాజమాన్య హక్కుల చట్టం ప్రజలకు ఆస్తుల రక్షణలో భద్రత లేకుండా తయారైందన్నారు. శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.సూర్యరావు మాట్లాడుతూ, ఈ చట్టం అమలైతే చిన్న సన్న కారు రైతులకు వారి స్థిరాస్తులు హక్కులు కోల్పోయే పరిస్థితులు ఉన్నాయని, చిన్నచిన్న విస్తీర్ణంలో నిర్మించుకున్న భవనాల యాజమాన్యపు హక్కులకు కూడా భంగం వాటిల్లుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జెఎసి ఏర్పాటుకు కృషి చేస్తామని విజయనగరం జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు దామోదర్‌రావు తెలిపారు. ఏమాత్రం న్యాయ పరిజ్ఞానం లేని ప్రభుత్వ అధికారులు స్థిరాస్తులు హక్కులను ఏ విధంగా నిర్ణయిస్తారని ఆల్ ఇండియా లాయర్ యూనియన్ విశాఖపట్నం ప్రతినిధులు బివి.రామాంజనేయరావు, ఎన్.వెంకటేశ్వరరావు, బగాది తులసీదాస్ ప్రశ్నించారు. 34 రోజులుగా విశాఖపట్నం న్యాయవాదుల సంఘం నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు హాజరైన ప్రతినిధులంతా సంఘీభావం తెలియజేశారు. ఇకనుంచి ఉత్తరాంధ్ర న్యాయవాది సంఘాలన్నీ ఉమ్మడిగా కార్యాచరణను రూపొందించుకొని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని తీర్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆముదాలవలస న్యాయవాదుల సంఘం అధ్యక్షులు విజయలక్ష్మి, చోడవరం బార్ ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి, విశాఖపట్నం స్టీరింగ్ కమిటీ ప్రతినిధులు సాకేటి మోహన్ నాయుడు, యుఎస్ఆర్.రాజు, జెవివి.రాఘవేంద్రరావు, ఎన్‌వి.సుమన్, విశాఖ న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి పైల శ్రీనివాసరావు, బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షులు కె.రామజోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -రావికమతం:రెండు లక్షల నిధులతో చేపట్టే రోడ్డు నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేసి పనులను చేపట్టడం జరిగిందని సర్పంచ్ దాసరి సూర్యకుమారి, సచివాలయ కన్వీనర్ దాసరి వరహాలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మండలంలో కవగుంట పంచాయతీ శివారు బుడ్డి బంద గ్రామంలో రెండు లక్షల నిధులతో గుళ్ళ పద్మనాభం దొర ఇంటి వద్ద నుంచి రొబ్బా సుభద్రమ్మ ఇంటి వరకు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అప్పట్లో లేఅవుట్ ప్రకారం సీసీ రోడ్డు నిర్మాణాలు జరగక పోవడంతో రహదారి సౌకర్యం లేక నానా అవస్థలు పడేవారన్నారు. శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ సిసి రోడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో రహదారి పనులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జీ.వరహాలదొర, జి శంకర్రావు, ఎస్.గంగరాజు, పి.రాము, కే.వరహాలు, వీరభద్ర రాజు పాల్గొన్నారు.

210 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి - మాడుగుల: జాలంపల్లి గ్రామంలో 210 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. ఆదివారం సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రి, భానోదయ గ్రామీణాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు, ఛైర్మన్ రామకొండారావు ఆధ్వర్యంలో జాలంపల్లిలో వైదయ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 210 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. శస్త్ర చికిత్స నిమిత్తం 56 మందిని ఎంపిక చేశారు. వీరందరినీ ఈనెల 22 వ తేదీన సోమవారం బస్సులో అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తీసుకొని వెళ్లి వైద్యం, శస్త్రచికిత్స చేయడం జరుగుతుందని నిర్వాహకులు రామ కొండలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మండల యాదవ సంఘం ప్రెసిడెంట్ పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ బాణం భీమలింగేశ్వరావు, గనుతూర్ కన్నయ్య పడాల్, నమ్మి బాలరాజు, మార్తి రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

షర్మిలతో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

ప్రజాశక్తి -చీడికాడ:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలుగా నూతనంగా నియమితులైన వైయస్ షర్మిలకి అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలియజేశారు చీడికాడ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 24న విశాఖపట్నంలో నిర్వహించే కాంగ్రెస్ సభకు షర్మిల విచ్చేయనున్నందున అనకాపల్లి జిల్లా నుంచి సుమారు 5 వేలు మందికి పైగా జన సమూహాన్ని సిద్ధం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో వైఎస్ షర్మిల ఎంట్రీతో కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవాన్ని పుంజుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

సముద్రంలో చెత్త తొలగిస్తున్న స్కూబా డైవర్లు

స్కూబా డైవర్ల సామాజిక సేవ ఆదర్శనీయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరాన్ని పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ఎకో-వైజాగ్ కార్యక్రమాల నేపథ్యంలో ఎకో-క్లీన్, ఎకో-బ్లూ, ఎకో-జీరో ప్లాస్టిక్ కార్యక్రమాలలో భాగంగా ఆదివారం రుషికొండ సముద్ర ప్రాంతంలో ప్లాటీపస్ ఆర్గనైజేషన్ స్కూబా డైవర్లు సముద్రంలో వ్యర్థాలను వెలికి తీసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. వారు విశాఖ నగరానికి సహకరించడం అభినందనీయమని, అందరికీ స్ఫూర్తిదాయకమని జివిఎంసి కమిషనర్ సిఎం సాయి కాంత్ వర్మ ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

ఎయు మెస్ తెరిపించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : సంక్రాంతి సెలవులు అనంతరం యూనివర్సిటీ తరగతులు ప్రారంభమై నాలుగు రోజులు గడుస్తున్నప్పటికీ నేటి వరకు యూనివర్సిటీ మెస్ ప్రారంభించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఎస్ఎఫ్ఐ ఎయు కమిటీ అధ్యక్షులు డి.వెంకటరమణ, కార్యదర్శి పి.సూర్య ఒక ప్రకటనలో తెలిపారు. తక్షణమే యూనివర్సిటీ అధికారులు స్పందించి మెస్ ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. మెస్ బిల్లు కడితే గానీ మెస్‌లు ఓపెన్ చేయబోమని హాస్టల్ అధికారులు చెప్పడం దుర్మార్గం అన్నారు. మెస్ బిల్లులు రిలీజ్ చేయడంలో సమస్య ఉందన్నారు. నెల మొత్తం వచ్చిన విద్యార్థికి, నెలలో 15 రోజులు వచ్చిన విద్యార్థికి ఒకే కొలమానంతో బిల్లులు రిలీజ్ చేశారన్నారు. తక్షణమే ఆడిట్ జరిపి మళ్ళీ మెస్స్ బిల్లులు రిలీజ్ చేయాలన్నారు. సోమవారం నుంచి మెస్ తెరవకపోతే విద్యార్థులతో రిజిస్ట్రార్ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

వైసిపి ఇంటికి వెళ్తేనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపి ప్రభుత్వం ఇంటికి వెళ్తేనే తప్ప రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడదని టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని నిలువుదోపిడీ చేయడానికే వైసిపి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. జగన్ తాడేపల్లికి పరిమితమై రాష్ట్ర పరిపాలన గాలికి వదిలేశారన్నారు. ప్రజలను జగన్ మభ్యపెట్టి మరలా అధికారంలోకి రావాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాలరాస్తూ దళితులపై దాడులు చేసి సిగ్గులేకుండా జగన్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరించారని విమర్శించారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే ఎస్మా ప్రయోగించారని, మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. వైసిపి అధికారంలోకి వచ్చిననాటి నుంచి విశాఖలో భూకబ్జాలు, దోపిడీలు పెరిగిపోయాయని ఆరోపించారు. రామానాయుడు స్టూడియోను కొట్టేయాలని వైసిపి నాయకులు చూసారని, ఎమ్మెల్యే వెలగపూడి సుప్రీంకోర్టులో కేసు వేయడంతో కోర్టు వైసిపికి మొట్టికాయలు వేసిందని తెలిపారు.

25 నుంచి ఓపెన్ చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శ్రీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 28 వరకు శ్రీచెస్ అకాడమీ రెండో ఫిడే రేటింగ్‌గల ఓపెన్ చెస్ టోర్నమెంట్-2024ను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, టోర్నమెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.బాబూరావు మీడియాతో మాట్లాడుతూ నాలుగు లక్షల రూపాయల నగదు బహుమతి విజేతలకు బహూకరిస్తామని తెలిపారు. విశాఖపట్నం ఎంవిపి.కాలనీ ఎస్ - 3 ఎరీనాలో నిర్వహించే ఈ పోటీల్లో వయస్సుతో సంబంధం లేకుండా అందరూ పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 23లోపు 9989971232 / 9849371760 నెంబర్లలో సంప్రదించి తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.